చావనుగాక భావను

గోవిందరాజు సీతాదేవి

పెళ్ళిపందిరిలో సందడి సందడిగా వుంది సన్నాయి మ్రోగుతోంది పురోహితుడి గొంతు బిగ్గరగా మంత్రాలు వల్లిస్తూ వినిపిస్తోంది స్నేహితురాలు పార్వతి పెళ్ళికి ఆహ్వానం అందుకుని వచ్చింది నిర్మల పందిరిలో అడుగు పెడుతూనే చుట్టూ కలయజూసి వధూవరుల వైపు కళ్ళు తిప్పింది వరుడు వధువు మెడలో మంగళసూత్రం కట్టటానికి లేచి నిలుచున్నాడు పార్వతి చెల్లెలు దుర్గ అక్క వెనక నిల్చుని పూవులజడని కాస్త పైకియెత్తి పట్టుకుంది వరుడు మంగళసూత్రం కట్టేస్తున్నాడు ఈ దృశ్యం యెంత మనోహరంగా వుంటుంది చూసే వారికి ? ఇంక ఆ వధూవరుల మనస్థితి యెలా వుంటుందో చెప్పటం కష్టం

నిర్మల స్నేహితురాలి వైపు ఆత్మీయంగా చూడసాగింది పార్వతి అదృష్టవంతురాలు తల్లి దండ్రులు యెన్ని సంబంధాలు చూసినా, వరులు యెందరు వచ్చి చూసి నచ్చలేదని వెళ్ళిపోయినా ఓ పెళ్ళికి వెళ్ళిన పార్వతిని చూసి యితను మనసిచ్చాడు నచ్చిందని తల్లిదండ్రులతో చెప్పి ఒప్పించి ఈ పెళ్ళి చేసుకుంటున్నాడంటే పార్వతిది అదృష్టం కదూ ! అలాగే తనకీ జరక్కూడదూ ! ఈ పెళ్ళికి వచ్చిన యిందరు యువకుల్లో యే ఒక్కరికైనా తను అందంగా వున్నట్లు కన్పించ కూడదూ ! అవుతుంది అయి తీరుతుంది తన చిన్నప్పుడు ఓ రోజు ఓ కోయవాడు అడుక్కోవ టానికి వచ్చి భిక్షం పెడుతున్న తన ముఖంలోకి చూసి చెప్పాడు –

చాలా అదృష్టవంతురాలివనీ, శ్రీమంతుడైన భర్త లభిస్తాడనీ ఆ మాటలు బాగా గుర్తు వున్నాయి అవి యదార్థం యెప్పుడో అయితీరతాయి అన్న ఆశ లోలోపల యెంతిగానో వుంది తల్లి దండ్రులు యెన్ని సంబంధాలు వెతికినా, యెందరో పెళ్ళికొడుకులు వచ్చి చూసి పెదవి విరిచివెడుతూ అన్న మాటలు అసలు మర్చిపోయింది "ఏం చూసి చేసుకోం మీ అమ్మాయిని అందం అంతంతమాత్రం చదువా పదో తరగతి కట్నమా మూడు వేలకి మించి యివ్వలేరు అన్ని విషయాలూ నార్మల్‌గా వున్నాయి. లాభంలేదు." అంటూ వెళ్ళిపోతూ వుంటే తల్లిదండ్రులు తలలు పట్టుకుని బాధ పడుతూంటే తనుమాత్రం సంతోషించేది

"వాళ్ళ ముఖం అసలు నాకు రాసిపెట్టివున్న వాళ్ళు వీళ్ళు కాదు. నాకోసం యే రాజకుమారుడో దిగివస్తాడు రావాలి" అనుకునేది యిలా కాలం గడిచిపోతూనేవుంది. తనకి వయస్సు ఇరవై యేడు సంవత్సరాలు దాటుతూ వుంది యింకాయెవ్వ డొస్తాడబ్బా ! అని కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూసి చూసి విసుగు చెందుతోంది ఈ మధ్య పార్వతికి ఈ పెళ్ళి యిలా కుదిరింది అనగానే తనలో ఆశ మళ్ళా చిగురించింది ఈ పెళ్ళికి తప్పకరావాలని తహతహలాడింది తనకీ, చెల్లెలికీ వుమ్మడిగావున్న ఒకే ఒక సిల్కు చీరెని చెంబు ఇస్త్రీ చేసి కట్టుకుని మరి వస్తూంటే తల్లివిసుగ్గా చూసింది–

"ఆ చీరె అలా పాడుచేస్తే యెలాగే యే పెళ్ళికొడుకు వచ్చినా కట్టుకోవటానికి అదన్నా సరిగ్గా లేకుంటే యెలాగే" అరిచినట్టు అంది

"నలపకుండా నే చూసుకుంటానమ్మా త్వరగా తిరిగివచ్చేసి దాచేస్తాగా" అంటూ మెల్లగా చెప్పి ఇంట్లోనించి బయటపడింది రెండు కిలోమీటర్ల దూరం యెండలో నడిచి వచ్చింది చెమటలో వళ్ళు తడిసిపోయింది సిల్కు చీరె వంటికి అంటుకుపోతూవుంది రోజూ ముతకనేత చీరెలు వెలిసిపోయినవి కట్టుకుని కట్టుకుని బోర్ కొట్టేస్తున్న సమయంలో యెప్పుడన్నా ఈ చీరె కట్టుకోవల్సిన అవసరం ఒస్తే సంబరంగా వుంటుంది ఒంటిమీద ఈ చీరె మెత్తగా జారి పోతూంటే యేదో తెలియని సంతోషం కల్గుతుంది ఇది చూసి –

"ఎంత అల్ప సంతోషివే అక్కా" అంటుంది చెల్లెలు ధరణి

ధరణిది దూకుడు స్వభావం కాలేజీలో చేరింది కానీ జీతం కట్టలేక పోవటంతో చదువు ఆపి ఇంట్లో కూర్చుండిపోయింది దాని ఈడు వాళ్ళందరూ చక్కగా చదువులు సాగిస్తున్నారు నా కన్నా అదృష్టం కల్సివస్తే నాన్నని పౌరోహిత్యం మాన్పించాలి చెల్లెలిని చదివించాలి అమ్మ ఎప్పుడూ మనసుపడే గుంటూరు జరీ చీరె కొనాలి

"అమ్మా అక్షింతలు" అన్న మాటకి నిర్మల

వులిక్కిపడి ఆలోచనల్లోంచి తేరుకుని చేయిపట్టి పెళ్ళిపీటలవైపు చూసింది వరుడు పార్వతి మెడలో మంగళసూత్రం కట్టేసి భార్యమీద అధికారం హస్తగతం చేసుకున్న వాడిలా పార్వతి పక్కన కూర్చున్నాడు

నిర్మల సంతోషంగా అక్షింతలు వేస్తూ అనుకుంది —

'అప్పుడే పెళ్లి అయిపోయిందా ?'

'అప్పుడే యేమిటండీ బాబూ మూడుగంటల నుంచీ తంతు జరుగుతుంటే '

తన పక్కనే కూర్చున్న ఓ యువకుడు చిన్నగా నవ్వుతూ నిర్మల ముఖంలోకి చూశాడు

నిర్మల సిగ్గుపడిపోయింది

ఖర్మ ! మనసులో అనుకోవల్సిన మాట పైకి అన్నందుకు

'మీరు ఆడపెళ్ళి వారి వైపు వారా ! మగపెళ్ళి వారి వైపువారా !'

అతను చనువుగా అడుగుతూంటే నిర్మల అతని ముఖంలోకి పరిశీలనగా చూసింది

''ఎందుకూ ?'' అంది

''ఎదురుప్రశ్నా ? భలేవారు మగపెళ్లివారి తరఫు వారిలానేవున్నారు ''

అనుమానంగా చూస్తున్నట్లు నటిస్తున్నాడని పసికట్టింది నిర్మల చిలిపిగా చూస్తూ అంది —

''మగపెళ్ళివారి తరఫే అనుకోండి ఏం చేస్తారు ?''

''ఏం చేస్తారూ అని మెల్లగా అడుగుతున్నారా! వారి తరుఫువారే అయితే కుర్చీమీద కుర్చీ వేస్తాను కూర్చోండని బలవంతం చేస్తాను కాఫీ కావాలా, టిఫిను కావాలా అని మీరు కావాలన్నవన్నీ తెప్పిస్తాను ''

నిర్మల ఫక్కున నవ్వింది

''మీరు భలే అందంగా నవ్వుతూన్నారే !''

నిర్మల నవ్వు ఆపేసింది గుండె క్షణం దడదడలాడింది అయినా ధైర్యం తెచ్చుకుని అంది—

''ఆడపెళ్ళివారి తరుఫునైతేనో ''

''చెప్పమంటారా !''

''యస్ ''

''చెప్పిన తర్వాత ఫీల్ కాకూడదు యెందుకంటే మీరెవరో నాకు రూఢిగా తెలియకున్నా చెప్పేస్తూన్నాను కనుక '' అని ఆగాడు

''ఫర్లేదు చెప్పండి'' అంటూ అక్కడే ఖాళీగా వున్న కుర్చీలో కూర్చుంది

''మీరు కూర్చున్న ఆ కుర్చీ లాక్కుపోతాను మరెవరో వచ్చారనీ కావాలనీ ''

నిర్మల నవ్వబోయి ఆగిపోయింది కాస్త కోపం తెచ్చుకుంది

''సారీ ! యింతకీ కాఫీ అందిందా మీకు ?''

''టిఫినే అందందే'' అనుకోకుండానే అనేసింది

''ఒక పని చెయ్యండి అలా వెళ్లి రెండు ప్లేట్లు వుప్మా పట్టించుకు రండి ''

''మీరు ఏ పెళ్ళివారి తరుఫువారు'' అనుమానం ముఖంలో కన్పడనీయకుండా అడిగింది

'చెప్తాను తప్పకుండా చెప్తాను. కానీ మీరు ముందు టిఫెనూ, కాఫీ తెప్పించిన తర్వాత '

నిర్మల చుట్టూ చూసింది పార్వతి చెల్లెలు అందరికీ వుప్మాఆకులు అందిస్తోంది నిర్మలని చూసి పల్కరించింది

''నిమ్మీ యింత ఆలశ్యంగానా రావటం. టిఫెను తిన్నావా ?''

'లేదు' అన్నట్లు తల వూపగానే ఓ ఆకు నిర్మలకి యిస్తూంటే పక్కన వున్న అతను కళ్ళతో సౌజ్ఞ చేశాడు 'నా మాట మర్చిపోతూన్నారు' అన్నట్లుగా

నిర్మల తన చేతిలోని వుప్మా ఆకు అతనికిచ్చి మరో ఆకు అందుకుంది పార్వతి చెల్లెలు నిర్మలనీ పక్కనున్న యువకుడినీ ఓసారి పరీక్షగా చూసి 'యెవరు ?' అన్నట్లు కళ్ళతోనే ప్రశ్నించింది

నిర్మల యేమో అనబోతూండగా అతను 'కాఫీ కూడా చెప్పేయండి' అని మాట్లాడేశాడు

'పంపిస్తాను నిర్మలా ! భోజనం చెయ్యకుండా వెళ్ళకు' అంటూ పార్వతి చెల్లెలు వెళ్ళిపోయింది ఎవరో కాఫీ గ్లాసులు అందిస్తూంటే అతనే అందుకుని ఒకటి నిర్మలకిచ్చి ఒకటి తను తీసుకుని తాగేశాడు

నిర్మలకి కాస్త చికాకు అన్పించింది

'మీరు ఏ పెళ్ళివారి తరుఫునారంటే చెప్ప లేదు '

''అబ్బ ఆ విషయం వదిలేలాలేరు ఒక్క రెండు నిముషాల్లో వస్తాను '' అంటూ అతను త్వరత్వరగా బైటకి వెళ్ళిపోయాడు

పెళ్ళి అయిపోవటంతో వచ్చిన అతిథులు కొందరు వుండిపోయారు కొందరు వెళ్ళిపోయారు పందిరి సగం ఖాళీ అయింది నిర్మల పార్వతి దగ్గరకి వెళ్ళి శుభాకాంక్షలు చెప్పింది పార్వతి చిన్నగా నవ్వి వూరుకుంది భర్తకి యెందరినో పరిచయం చేస్తోంది కానీ నిర్మలని పట్టించుకో లేదు పెళ్ళికొడుకు తరుఫు స్నేహితులు వస్తూన్నారు పరిచయాల తర్వాత వెళ్ళిపోతూ నిర్మల వైపు చూస్తూన్నారు

'ఆమె ఎవరు ?' ఒకతను ప్రత్యేకంగా అడిగాడు

'నా ఫ్రెండ్ నిర్మల'

'ఓ' అంటూన్న అతనివైపు పరిశీలనగా చూసింది నిర్మల

అతను అదేం పట్టించుకోకుండా తన వెనక వున్న మరో అమ్మాయిని తనకిగా తను పరిచయం చేసుకుని కబుర్లు చెప్పసాగాడు

నిర్మల వెనక్కి చూసింది

ఆ అమ్మాయి అందంగా వుంది ఇంగ్లీషులో తెగమాట్లాడేస్తోంది అందమైన బట్టలు వేసుకుంది ఒయ్యారాలు కురిపిస్తోంది అందువల్ల అందరి కళ్ళూ ఆమెవైపు వున్నాయి నిర్మలలో తెలియని నిరుత్సాహం చోటు చేసుకోసాగింది అక్కడనుంచి లేచింది భోజనాలవరకూ వుండబుద్ధి కావటంలేదు వెళ్ళివస్తాను అని చెప్పి పెళ్లి యిల్లు దాటుతూ 'ఇందాకటి యువకుడు మళ్ళా కన్పిస్తే బాగుండు' అని పందిరి అంతా చూసింది కన్పించ లేదు యెండలో నడుస్తూండగా వెనకనించి పిలుపు విన్పించింది

'నిమ్మీగారూ ఒక్కక్షణం '

నిర్మల వులిక్కిపడి తలతిప్పి చూసింది

అతనే ! తను వెతుకుతూన్నతనే తన మనస్సుని గంట క్రితం అయస్కాంతంలా ఆకర్షించిన అతనే క్షణంలో నిర్మల ఆలోచనలు అలా అలా సాగిపోసాగాయి అవి తియ్య తియ్యగా వున్నట్లుగా అనుభూతి కల్గించసాగాయి

'నిమ్మీ ! మీరంటే యెందుకో నా కిష్టం ఏర్పడింది మరి మీకు ?' అని అతను అడిగి తీరతాడు సిగ్గుపడకుండా నాకూ అంతే ! అని చెప్పాలి నా తల్లిదండ్రులకి పరిచయం చెయ్యాలి



అలా పరిచయం చేస్తే అతను నన్నే పెళ్ళాడతా నంటే అమ్మా, నాన్నా యెంతో సంతోషిస్తారు!

మనసు కళ్ళెంలేని గుర్రంలా పరుగెత్తుతూంటే బుద్ధి మందలించసాగింది –

'ఆగు ఆగు అసలు అతనేం చెప్తాడో ముందు విను వివరాలు అడుగు'

నిర్మల ఆలోచనలు ఆపి 'ఏమిటి' అని అడిగింది మనస్సుని అదిమిపట్టుకుని, "మీ ఇల్లు యెక్కడ?" అన్నాడు

'వస్తారా?'

'రాను కానీ '

"నా అడ్రెస్ కావాలా? తప్పక చెప్తాను కానీ యింతకీ మీరెవరు? మీ పేరూ, వూరూ "

"నా పేరు సూరిబాబు బికాం పాస్ అయాను కులం మీ కులమే వూరు అనకాపల్లి యింకపోతే "

"చాలు ఇంతకీ మీరేం వుద్యోగం చేస్తున్నారు? తల్లిదండ్రులున్నారా?"

సూరిబాబు మామూలుగా మాట్లాడేవాడల్లా క్షణం ఆగిపోయాడు నిర్మల ముఖంలోకి పరీక్షగా చూశాడు

"మీకు ?" తడబడిపోయాడు

"మీ కు?" నిర్మల ధైర్యాన్ని తెచ్చుకుంటూ అతని ప్రశ్న అర్థమైనదానిలా అంది

సూరిబాబులో గాభరా యెక్కువైంది

'నేను వెళ్ళివస్తాను' అంటూ వెళ్ళబోతూన్న అతన్ని ఆపి తన యింటి అడ్రెస్ చెప్పింది సూరిబాబు ముఖం పాలిపోయినట్లు అయింది, నిర్మల ముఖంలో కన్పించే కాంతి చూస్తూంటే

"'వస్తాను' అంటూన్నారు నా ప్రశ్నకి జవాబు "

'అడ్రెస్ వుందిగా వుత్తరం రాస్తాను' వేగంగా వెళ్ళిపోయాడు

నిర్మల యింటికి వచ్చింది సంతోషంతో తలమున్కలవుతూ సూరిబాబు వుత్తరం కోసం యెదురు చూడసాగింది రాలేదు నిర్మలలో ఆశ చావలేదు నాలుగు రోజుల తర్వాత నిర్మలకి వుత్తరం వచ్చింది సూరిబాబు దగ్గరనుంచే!

నిర్మల చెవుల్లో సన్నాయి మేళం విన్పించసాగింది రంగురంగుల కలలు కళ్ళలో కదులుతున్నాయి వుత్తరం పూర్తిగా చదివేసరికి తల తిరిగిపోయింది

చావనుగాక చావను

నిర్మలగారూ!

మీ పూర్తి పేరు నాకు తెలియదు. అనుకోకుండా గమ్మత్తుగా నాకు మీతో పరిచయం అయింది మీ అమాయకమైన ముఖం నన్నాకర్షించింది. నిజమే మీరు నా గురించి యేవేవో వూహాలని పెంచుకునేలా వున్నారన్నది నా కర్థమైపోయింది దీనికి నా బాధ్యత యేంలేదు అనుకోండి అయితే ఒక్క నిజం మీకు చెప్పాలని అన్పిస్తోంది నేనో నిరుద్యోగిని మీకు చెప్పిన నా పేరూ వూరూ వచ్చి అబద్ధం నేను యెక్కడ పెళ్ళి జరుగుతున్నా ఆ రోజు వెళ్ళి మీలాంటి యెవరినో ఒకరిని పరిచయం చేసుకుని, వాళ్ళలో వాళ్ళలా వీళ్ళలో వీళ్ళలా నటించి, టిఫెనూ, కాఫీ, భోజనం తిని దొరికినది యేదైనా పట్టుకుని పారిపోవటమే వృత్తిగా గల దొంగబ్రతుక్కి అలవాటుపడిన నిర్భాగ్యుడిని ఆ రోజు మనిద్దరి మాటలూ ఓ ముసలాయన వింటూ నన్ను గమనించకుంటే మీకు యింకా తియ్యటి కబుర్లు చెప్పి ఏ అవకాశమైనా దొరికేవరకూ వుండేవాడిని కానీ నా ప్లానే పాడైపోయింది లాభంలేదని బైటపడిపోయాను మీ సాయంతో మరుసటి రోజు మరో పెళ్ళికి వెళ్ళి పట్టుబడి అత్తవారింటికి వచ్చేశాను ఈ వుత్తరం మీకు యెంతో కష్టంమీద అందేలా యేర్పాటు చేశాను నన్ను మన్నిస్తారు కదూ

ఓ మనిషి.

నిర్మల కళ్ళనుంచి ధారాపాతంగా నీళ్ళు కారటం చూసింది ధరణి 'అక్కా! ఏమిటే ఈ ఉత్తరం' అంటూ లాక్కుని చూసింది

నిర్మల వెక్కి వెక్కి ఏడుస్తూ వుండిపోయింది ధరణి అక్క వీపుమీద చెయ్యివేసి అనునయిస్తూ అంది –

'అక్కా! నీకు నేను చెప్పగలదాన్ని కాను కానీ ఆడపిల్ల పెళ్ళికానంత మాత్రాన యింతగా దిగులు పడాలా! ఛీ ఛీ కళ్ళు తుడుచుకో' అని సముదాయించి తన పని చూసుకోసాగింది.

'అమ్మాయ్! అలా వున్నావే?' అన్న తల్లిదండ్రుల ప్రశ్నకి జవాబివ్వలేదు నిర్మల

* * *

నాలుగురోజులు అతిభారంగా గడిపింది నిర్మల నిద్రపోకుండా ఆలోచించి ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది అర్ధరాత్రి ధరణి మంచి నిద్రలోవుంది యేదో శబ్దం అయినట్లు విన్పించి మెలుకువచ్చి కళ్ళు తెరిచింది పక్కకి చూసింది నిర్మలలేదు

'అక్కా ! యెక్కడికెళ్ళావే?'

అన్న పిలుపుకి, నెత్తిన కిర్సనాయిలు పోసుకుని నిప్పుపుల్ల గీసి వెలిగించుకోబోతూన్న నిర్మల చెయ్యి వణికి అగ్గిపుల్ల కిందకి జారిపోయి ఆరిపోయింది అరసెకండ్‌లో జారిపోయిన ధైర్యాన్ని కూడగట్టుకుని మరోపుల్ల వెలిగించింది

ధరణి అరుపులకి తల్లితండ్రి లేచారు ధరణి వున్న రెండు గదులూ వెతికి వంటగదిలోకి వస్తూ పరిస్థితి గమనించి నిర్విణ్ణురాలైంది మరుక్షణంలోనే ఒక్క పరుగున వచ్చి అక్కమీద పడింది

"ఏం చేస్తున్నావే పిరికి పందా! ఛీఛీ నువ్వు యింత పిరికిదానివా! ఆగు నిన్ను చావనీయను" అంచులు అంటుకుని మంటలు పైకిలేస్తూన్న చేనేత చీరని లాగిపారేసింది ఆ లాగటంలో ధరణి రెండు చేతులూ కాలి బొబ్బలెక్కాయి

తల్లితండ్రీ వచ్చి నిర్మల చేయబోయిన అఘాయిత్యాన్ని చూసి ఘొల్లుమన్నారు

"అమ్మా నిమ్మీ! నేను ఆడపిల్ల పెళ్ళి చేయలేని అసమర్థుడినే అయినా యింత శిక్ష వేయాలని యెందుకనుకున్నావమ్మా "

ఆయన గొంతు బొంగురుపోయింది తల్లి గుండెలు బాదుకుంటూ రాగాలు తీయసాగింది ధరణి తల్లిదండ్రులని సమాధానపరుస్తూ అంది –

"ఆరవకండి నాన్నా, యిరుగూ పొరుగూ చేరతారు. అక్కకి యేం ఫర్లేదు" అంటూన్న కూతురి ధైర్యానికి విస్తుపోతూ చూడసాగాడు

"అమ్మా ధరణీ! అరవనమ్మా అరవను యేదీ నీ చేతులకి కాస్త మందు రాయనీయి"

"నా చేతులకి మందు అక్క రాయాలి దానివల్లనేకదూ నాకీ గాయాలు అది అక్కకిచ్చి మీరూ అమ్మ వెళ్ళి హాయిగా నిద్రపోండి మీకు









న్ద్ర రాదని నాకు తెల్సు, అయినా వెళ్ళమంటూన్నాను యెందుకంటే అక్కతో యేకాంతంగా మాట్లాడాలి ''

తల్లీ తండ్రీ ధరణికి జవాబు చెప్పలేక మెల్లగా బయటికి వెళ్ళిపోయారు. ధరణి గదిలోపల ఘడియ పెట్టి అక్క దగ్గరగా వచ్చింది

నిర్మల రెండు చేతులతోనూ ముఖం కప్పుకుని భోరుమంది

''అక్కా ! యేడుస్తున్నావా ! ఛీ ఈ కాలం పిల్లలు యేడవకూడదక్కా నిజం అది రూలు ఏడ్పు మాని జవాబు చెప్పు ఎందుకు చావాలని అనుకున్నావ్ ?''

'' ''

''పెళ్ళి కాలేదనా ?''

'' ''

''ప్రేమిస్తున్నానంటూ యే వెధవా ముందుకు రాలేదనా ?''

'' ''

''పెళ్ళి కాకున్నా హాయిగా బ్రతకవచ్చునే ''

''ఆడపిల్లకి పెళ్ళే ముఖ్యం అది కాకుంటే జీవితం వ్యర్థం '' వెక్కిళ్ళమధ్య అంది నిర్మల

''ఇది యే సినిమాలో డైలాగు ? ఏ నవలలో డైలాగు ?'' ధరణి పకపకా నవ్వింది

నిర్మల ముఖం చిన్నబోయింది ధరణి శాంతంగా అంది -అక్కా! ప్రతి మనిషి జీవితంలోనూ అవసరమైనవీ అతి ముఖ్యమైనవీ చాలా చాలా వుంటాయి కాదనను కానీ ప్రస్తుత సమాజంలో యెందరికి కావల్సినవి అందుతూన్నాయి 'కొందరు అదృష్టవంతులకి అందటంలేదా ?' అని నువ్వు ప్రశ్నించవచ్చు ఏ విషయంలో చూసినా అదృష్టవంతులకంటే దురదృష్టవంతుల శాతమే యెక్కువ ఈ కోవలోకే వస్తారు మనలాంటి సామాన్య కుటుంబాల్లో పుట్టిన ఆడపిల్లలు ఒప్పుకుంటావా! కావల్సినవీ కావాలనుకున్నవీ దొరకని ప్రతి వ్యక్తీ ఆత్మహత్యా ప్రయత్నం చేసుకుంటే యెవరికీ యే నష్టమూ వుండదు, గవర్నమెంట్‌కి జనాభా భారం తగ్గించిన ఘనత దక్కటం తప్ప ''

ధరణి గడగడా అనేస్తుంటే నిర్మల కళ్ళు తుడుచుకుంటూ చురచురా చూసింది

''నీకేం తెలుసే నా బాధ నాన్న నా పెళ్ళి చేయలేదు నా పెళ్ళి నేను చేసుకోలేను నా చావుతో ఈ సమస్యకి పరిష్కారం కుదురుతుందిగా ?''

చావనుగాక చావను

''కాదు కానేకాదు నీ తర్వాత నేను లేమా నీలా నేను పెళ్ళి కాలేదని దిగులుపడి చావను చూడూ! నీలానే నేనూ ఆలోచిస్తే ఈసరికి మూడు అవకాశాలు వచ్చినా తోసిపారేసి బ్రతుకుతూన్నాను ఒకరు కాదు యిద్దరు యువకులు పెళ్ళి చేసుకుంటామని షికార్లకీ, సినీమాలకీ తిప్పి పిరికివెధవల్లా పారిపోయారు కాస్త బాధపడ్డాను అనుకో వాళ్ళు ప్రేమిస్తున్నాం అన్నా నేను యేమీ పోగొట్టుకోలేదు కనక యివాళిలా నిర్భయంగా తలెత్తుకుని తిరగ్గలుగుతున్నాను కాలేజీలో చేరినా చదువు సాగక మానవల్సివచ్చింది అప్పుడూ చావచ్చుగా నేనలా వూహించను పట్టుదలగా ఆ డిగ్రీ సంపాదించాలనే ప్రైవేటుగా పరీక్షకి కట్టాను పాస్ అయితీరతాను అక్కా ! 'జీవితంలో ఎదురయ్యే ఓటమిని విజయంగా మార్చుకునేలా కృషి చేయాలి' అని మా ప్రైవేటు మాష్టారు మరీ మరీ చెప్తుంటారు ఇదే మనసి ముందుకి నడిపిస్తుంది ఇంతేకాదు నేను వూరిమీద బలాదూరు తిరుగుతూన్నానని అమ్మా, నాన్నా, నువ్వూ తిడుతున్నా నే జవాబివ్వటంలేదు యెందుకో తెల్సునా ? నేనలా తిరగటంలేదు ఓ కుట్టు క్లాస్‌లో చేరాను ఇదివరకే కొంత వచ్చు కనుక నెల జీతంగా యిస్తాం—అంటూ వాళ్ళు నాకు ట్రైనింగ్ యిస్తున్నారు ఇప్పుడు జీతం యెనభై తర్వాత మాటయాభై తర్వాత మూడు వందలు యిస్తామన్నారు ''

నిర్మల చెల్లెలివైపు ఆశ్చర్యంగా చూస్తూ అంది—

> ## కర్కాటక గర్భాలు
>
> ఈ నేలమీద పుట్టి
> నీతి నిజాయితీల్ని పాతిపెట్టి
> దేశభక్తులుగా చెలామణి అవుతూన్న
> ఈ మతకరి రాజకీయపు పాపములంతా
> ముమ్మాటికీ
> కర్కాటక గర్భులే !
>
> — ద్వా. వా. శాస్త్రి

'నిజంగానా ! ఈ మాట ఇంట్లో యెందుకు చెప్పలేదు '

''నెలజీతం తీసుకుని నా ప్రైవేటు మాష్టారి ఫీజు పోగా మిగతాది అంతా అమ్మకిచ్చి ఆశ్చర్యంలో ముంచాలని ''

''ధరణీ '' కళ్ళలో నీళ్ళు తిరిగివాయి నిర్మలకి

''అక్కా! యెవరి బ్రతుకుల్లోనూ యెప్పుడూ చీకటే వుండదు ఎటునించో ఓ కాంతి కిరణం ప్రసరించక తప్పదు ఈ ఆశతోనే మనలాంటి అమ్మాయిలు బ్రతుకులని ముందుకు సాగించాలి కృషి చేద్దాం ఫలితం కోసం వేచివుందాం ఏమంటావు? చూడూ రేపటినించీ నువ్వూ నా దారిలోకే రా వస్తావుగా ''

నిర్మల నోటినుంచి మాట రావటంలేదు

''అక్కా ! నా మాటలు నొప్పుకుంటే, నీవు కృషి చేసినా ఫలించకుంటే చావే, శాంతి నిస్తుందని నమ్మకం వుంటే అది నీ చేతిలోని పనేగా ''

''ధరణీ ! మరోసారి అలా అనకు నేను యింతక్రితం ఆలోచించినది అంతా తప్పే ఇంక అలా ఆలోచించను నేను చావనుగాక చావను ! పెళ్ళి జీవితానికి అవసరమే అయినా అది కుదరనప్పుడు దానికోసం మతి పోగొట్టుకోను నీలా నేనూ '' నిర్మల గొంతు బొంగురుపోయింది

''అక్కా చూశావా ! గంటక్రితం నీ ఆలోచనకీ యిప్పటి నీ ఆలోచనకీ యెంత తేడా వచ్చిందో జీవితం అంటే యింతే '' అంటూన్న చెల్లెలిని గట్టిగా కౌగలించుకుంది నిర్మల

''అక్కా ! తల్లీ దండ్రీ — అన్నా, చెల్లీ, స్నేహితులూ, ఆత్మీయులూ వగైరా వగైరా అందించే ఆత్మీయతతో కూడా బ్రతకవచ్చునేమో ! కాదు బ్రతకవచ్చు ''

''కరెక్ట్ '' అంటూన్న పెద్దకూతురినీ, చిన్నకూతురినీ తలుపు సందుల్లోనించి చూసిన తల్లీదండ్రీ 'అమ్మయ్య, ఆ భగవంతుడు మనయందు వున్నాడు' అనుకున్నారు వారి కళ్ళలో నీళ్ళు నిండుకున్నాయి

''ఏమండీ ! కాలం మనుషుల్లో మార్పుని తెస్తుందా !'' అంది తల్లి

''కాదు ! అవసరాలు మనిషిలో మార్పుని తెస్తూన్నట్లున్నాయి'' అన్నాడు తండ్రి

'ఔరా ?' విస్తుపోతూ చూడసాగిందా ఇల్లాలు ★